తోషకరమైన ఇలాంటి సంఘటనలు ఆ పసిపాపకు నిత్యం ఎదురౌతున్నాయి.

కూతురు స్థితి గమనిస్తున్న శేఖర్ కనుబొమ ముడిపడింది.



“అసలేమైంది ప్రసాద్... బేబీకి...?” డాక్టర్ని అడిగాడు భయంగా... అనుమానంగా.

“ఏమైందా... మెల్లిగా అడుగుతున్నావా.. !” అన్నట్లు భర్త వంక కోపంగా... నిష్ఠూరంగా... నిస్సహాయంగా చూస్తోంది అతని భార్య.

పల్స్ చూస్తూ “త్రాగింది క్వార్టర్ బాటిలే అయినా... పసిపిల్ల కదా కాస్త హడావిడి చేసింది. దుకాణం నేరుగా ఇంట్లో తెరిస్తే కాస్త జాగ్రత్తగా ఉండాలి బ్రదర్...! డోంట్ వర్రీ... షి విల్ బి ఆల్‌రైట్... ఆ... ఇంతకీ రాత్రికి మన పార్టీ ఎక్కడ...?” అన్నాడు.

అతనూ మందు గురుడే...

ఈ మాటలు వింటున్న నర్సు పిల్ల కిసుక్కుమంది. శేఖరం భార్య ముఖం ఎర్రగా చేసుకుని తల తిప్పుకుంది.

“షటప్...! ఇంకెప్పుడూ పార్టీ మాటెత్తకు...” ఫ్రెండ్‌ని కోపంగా కసిరాడు శేఖర్. “నా పాపని నాకు దక్కించావు థాంక్స్” అని మొహం తిప్పుకున్నాడు. ●

# కథ

దంతుర్తి చిన రామచంద్రరావు

ఓ మంచి కథ వ్రాద్దామని ఎప్పట్నించో కుతూహలం.

కాగితాలు ముందేసుకుని, కలం తీస్తే ఇహ అంత చప్పని లేవలేను. అది నాలో ఓ బలహీనత.

ఆ వేళ రాత్రి మేడమీద గదిలో కూర్చుని కథ వ్రాస్తున్నాను. కుదరడం లేదు. మనసులో ఉన్నది కాగితంమీదికి కమ్మగా దిగాలంటే కలం బలమే చాలదు. కాలం కూడా కలిసి రావాలి మరి!

ఇంతలోనే - “ఏవండీ - పదకొండు దాటింది - లేవండీ” అంటూ నస ప్రారంభించింది మా మేడమ్.

విసుగ్గా ఆమెకేసి చూసాను. ఆమెగారు కొరకొరా చూస్తూంది.

“ఏమిటీ - అలా చూస్తారూ? కలం అక్కడ పారేసి లేవక!” అని ఆమెగారనలేదుగాని ఉద్దేశం అదే. నో డౌట్!

ఆడవాళ్ల మనసుకుసుమకోమలం అన్నారు.

పైగా కొత్త కాపురం. ‘శ్రీదేవి’ అంత అందగత్తె కాకపోయినా ‘భానుప్రియ’లా మెత్తని మనిషి. ఇహ ఆ ధ్యాసలో పడితే ఈ కథ నిద్రపోడం ఖాయం. నిద్రలోంచే అలా కంచికి టికెట్ తీసుకున్నా తీసుకోవచ్చు!

మళ్లీ ఏవో నాలుగు లైన్లు వ్రాసాను.

“మీ అవస్థ చూస్తూనే ఉన్నాను. అంత చేతకానివాళ్ళు అసలు వ్రాయడమెందుకో” అన్నట్టు మేడమీద మేడమ్, నా దగ్గరగావచ్చి - “ఏవండీ - పోనీ నేను వ్రాసిపెట్టనా?” అంది.

“నీ మొహం - నీవల్ల ఏమౌతుంది? పోయి పడుకో” అన్నాను.

తెల్లవారింది. షరా మామూలేగా. ‘గుడ్‌మార్నింగ్’ అన్నట్టు నుంచుంది ఎదురింటి డాబామీద డార్లింగ్. చిరునవ్వు నవ్వాను. రిసీవ్ చేసుకుంది.

మేడమీది మేడమ్‌కి తెలియకుండా, డాబామీది డార్లింగ్‌ని కలుసుకుని, కథ వ్రాసిపెట్టమని కోరాను. ఆమెగారు రచయిత్రి మరి! నాలుగైదు కథలు ఆమెవి పత్రికల్లో పడ్డాయి కూడ. పడిన ప్రతి కథా పట్టుకొచ్చి ‘చూడండీ’ అంటూ నాకు చూపించేది. నేను చూస్తుంటే “మనదంతా సీయింగ్ బ్యూటీయే గదా!” అనేది. నేనే మనగలను? నా రిక్వెస్ట్‌ని డార్లింగ్ మొదట్లో ఓ.కె. చెయ్యలేదు. కనుక ప్రాధేయపడ్డాను. అయినా ‘ఉ’ అనక ‘ఆ’ అనక, కాస్సేపు ఏడిపించి అనక ‘ఎస్’ అంది.

నెల తిరిగిందో లేదో - నేనో రోజున ఆఫీసుకి వెడుతుంటే డాబామీది డార్లింగ్ కేకేసి చెప్పింది “కథ పడిందండీ పత్రికలో” అని. తల తిరిగినంత సంతోషమయింది. ఆఫీసుకెళ్లే తొందరలో పత్రిక చూడ్డం కుదరలేదు. దార్లోనే గుళ్ళో కొబ్బరికాయ కొట్టేసాను. ఆఫీసంతా చెప్పేసాను నా కథ పడిన సంగతి.

రాత్రి డార్లింగ్ ఇంట్లో పత్రిక చూసాను. అద్భుతంగా పడింది కథ.

“కథ” మినీ కథా రచయిత శ్రీ డి. సి. హెచ్. రామచంద్రరావు తూర్పు గోదావరి జిల్లా సామర్లకోటలో 1929 లో జన్మించారు. ఆంధ్ర విశ్వవిద్యాలయం నుంచి బి.ఎ. బి.కాం., ఎం.ఎ. పట్టా పొందారు. ప్రభుత్వ సర్వీసులో గెజిటెడ్ ఆఫీసరుగా 1987 లో పదవీ విరమణ చేశారు. విద్యార్థి దశనుంచీ సాహిత్యంలో అభిలాష, అనుభవం ఉన్నాయి. నవలలు, కథలు, వ్యాసాలు, కవితలు చాలా వ్రాశారు. రాష్ట్రంలోని ఎన్నో దిన, వారపత్రికలలో వీరి రచనలు ప్రచురింపబడ్డాయి.





రచయిత పేరు చూస్తే నాదికాదు. "శ్రీలత" అని ఉంది.

"ఏమిటీ అన్యాయం?" అన్నాను.

"అన్యాయమా? భలేవారే! కథ మీది కాదు. కథనంమీది కాదు. రచనా మీదికాదు. మరి మీపేరెలా పడుతుంది?" అంది డార్లింగ్.

తర్వాత ఓ రోజున - "కథ తాలూకు డబ్బు అందిందండీ" అంటూ రూపా యిన్నర నా చేతిలో పెట్టింది మేడ మీది మేడమ్. "ఇది మీ కానుకాలూ, పోస్టేజి ఖర్చు నిమిత్తం" అని కూడా అంది. అయోమయంగా ఆమెకేసి నేను చూస్తోంటే - "మిగతా ఎం.ఓ. డబ్బు మీ డార్లింగూ, నేనూ సమానంగా పంచుకున్నాం" అంది.

"అసలు ఎం.ఓ. మేడమ్‌కి ఎలా వచ్చింది? డార్లింగ్‌కి రావాలి గదా" అనుకున్నాను.

మర్నాడు డార్లింగ్ చెప్పింది - "కథ వ్రాసింది మేడమ్మే - నేను కాదు. లోగడ నా కథలు వ్రాసిందీ ఆవిడే. పెన్‌నేమ్ 'శ్రీలత'. పూర్వాశ్రమంలో మేం క్లాస్‌మేట్స్. ఎందులోనైనా సరే పార్ట్‌నర్స్‌గా ఉంటాం" అంది.

మర్నాడు - "స్వంత మేడకంటే ఎదురింటి డాబా యే గొప్ప అనుకోవడం మగబుద్ధికి మామూలే" అంది మేడమీద మేడమ్ వాలు జడ నా భుజానికేసి కొడుతూ.

మొన్న - "పారడీ వ్రాయబోతే పారడాక్స్ అవుతుంది మీలాంటివాళ్ళు వ్రాస్తేనే" అంది.

నిన్న - లోకమంతా వెన్నెల కురిసేవేళ గదిలో కూర్చుని రాస్తే కమ్మని కథలు రావు" అంది.

ఈవేళ - "చార్మింగ్ లేడీల మొగుళ్ళు చాలామంది ఎక్కడో ఆర్మీలో ఉన్నట్టుగా వుంది" అంది. జాలేసింది. కాని నిన్నా మొన్నా అన్నదానికి ఎంత ఇన్‌సల్ట్ ఫీలయ్యానో.

పౌరుషం పొటేక్కింది. ఓ కథకి ఐడియా కూడా వచ్చింది.

ఇన్‌సల్ట్ అనుకుంటే ఎలా? మేడమీని కన్‌సల్ట్ చేసే కథ వ్రాసేసాను. అదే ఇది !!

●

తానా ఆంధ్రసచిత్ర వారపత్రికల సంయుక్త సాహితీసంబరం పోటీలో బహుమతిపొందిన కవితలు

# నైజం

-'నాగముని'

ఆమె
ఎవ్వరో తెలీదు
భలే...
ఎర్రగా బుర్రగా వుంది!
ఎదురుగా వెళ్ళి
ఒకసారి
వాటేసుకోవాలనుంది!

అతడెవరో
చూడు...
నా చెల్లి
వంకే చూస్తున్నాడు...
వెనుక మాటున
వెళ్ళి
'ఒకేసారి'
నరికేయాలనుంది!!



"నైజం" కవితా రచయిత శ్రీ ఎన్. కె. నాగేశ్వరరావు కథాలోకానికి పరిచితులే. సుమారు పదమూడు కలం పేర్లతో వ్రాసిన వీరి రచనలు అన్ని పత్రికలలోను చోటు చేసుకున్నాయి. వివిధ పత్రికల ద్వారా 9 సార్లు బహుమతులు గెలుచు కున్నారు. తన